క్లుప్తంగా

కవి, సాహితీ విశ్లేషకుడు వేదాద్రికి గౌరవ డాక్టరేట్



పూసపాటి వేదాద్రికి గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ నిర్వాహకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం వజినేపల్లికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ విశ్లేషకుడు పూసపాటి వేదాద్రికి శుక్రవారం గౌరవ డాక్టరేట్ లభించింది. సమాజానికి ఆయన అందించిన సాహిత్య సేవలను గుర్తించి ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్, హైదరాబాద్ వారు 'డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరేచర్ అవార్డు – 2025'ను హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. ఫౌండర్, చైర్మన్ డాక్టర్ అల్లూరి విల్సన్, డాక్టర్ పీవీపీ అంజనీ కుమారి, డాక్టర్ ఎస్.ఇందిరా ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై విచారణ



ఉపాధి హామీ పనుల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జగదీష్‌కుమార్

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై శుక్రవారం ఎంపీడీఓ జగదీష్‌కుమార్ విచారణ జరిపారు. శుక్రవారం మంచ్యాతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచ్యాతండాలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపినట్లు తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఉమాదేవి, మాజీ సర్పంచ్ రాయసెల్, బాబునాయక్, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా నాగేశ్వరరావు



కోదాడరూరల్ : కోదాడ బార్ అసోసియేషన్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా న్యాయవాది పాలేటి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. శుక్రవారం కోదాడలో జరిగిన బార్ అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు. సహాయ ఎన్నికల ఆఫీసర్లుగా మంద వెంకటేశ్వర్లు, మాదవరపు రామకృష్ణాను ఎన్నుకున్నారు. కోదాడ బార్ అసోసియేషన్‌కు 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు నూతన కమిటీ ఎన్నికలు ఈ నెలలో జరగనున్నందున వీరిని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

రూ.1.35 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న వీరారెడ్డి

మునగాల : మండలంలోని నారాయణగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించబోయే సురమాంబ, దేవి ఆలయం, రేణుక ఎల్లమ్మ, వనమైసమ్మ, శివలింగం, నంది, వినాయకుడు, కౌండిన్య మహర్షి, పోతరాజు, కలకోడిపుంజు విగ్రహాల కోసం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి వీరారెడ్డి రూ.1.35 లక్షల విరాళాన్ని దేవాలయ కమిటీకి శుక్రవారం అందజేశారు.

బాలికలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి

మునగాల : బాలికలు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని కోదాడ షీటీమ్ ప్రతినిధులు జ్యోతి, కారింగుల కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ అనే అంశంపై కోదాడ షీటీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు శేషగాని సురేష్ మాట్లాడుతూ ఆడపిల్లల మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ కన్వీనర్ కె.గాయత్రి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపిక

మఠంపల్లి : టీజీ సెట్– 2025 గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మఠంపల్లి మండలంలోని అంత్యాతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు బానోతు శ్రీవల్లీ, గుగులోతు శ్రీవిద్య, బానావతు వసంత, ధీరావతు సింధు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్‌.కె.మస్తాన్, ఉపాధ్యాయులు సీహెచ్.అనిల్‌కుమార్, బి.బాలాజీ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మబ్బులు.. రైతుల్లో గుబులు

ప్రారంభం కాని కొనుగోళ్లు

- కొనసాగుతున్న వరి కోతలు
- కల్లాల్లోనే ధాన్యం రాసులు
- వాతావరణంలో మార్పులతో ఆందోళనలో అన్నదాతలు



హుజూర్‌నగర్ పరిధిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను



ధాన్యం కుప్ప చేసి పట్టాలు కప్పుతున్న రైతులు

హుజూర్‌నగర్ : ఆకాశం మేఘావృతమై వర్ష సూచన కన్పించడం అన్నదాతలను దడ పుట్టిస్తోంది. గత రెండు రోజులుగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు చోట్ల చిరుజల్లులు పడ్డాయి. తీరా పంట చేతికొచ్చే దశలో వర్షం కుమ్మరిస్తే పంట ఆగం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో ముమ్మరంగా వరికోతలు కొనసాగుతున్నాయి. పంట కోసిన రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్లల్లో తరలించి పొలాల్లోని ఎత్తైన ప్రదేశాల్లో, కల్లాల్లో, బహిరంగ ప్రాంతాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ఆకాశంలో మబ్బులు పట్టిన సమయంలో ధాన్యాన్ని రాసులుగా చేసుకుని పట్టాలు కప్పుకుంటున్నారు. తిరిగి ఎండ రాగానే మళ్లీ ఆరబెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆకాశంలో పడుతున్న మబ్బులు రైతుల గుండెల్లో గుబులురేపుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

30 శాతమే కోతలు పూర్తి..

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో దాదాపు 1.40 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. దీనిలో ఇప్పటి వరకు 20 నుంచి 30 శాతం పంట కోత పూర్తయింది. ఇంకా లక్షకు పైగా ఎకరాల్లో వరి పంటను కోయాల్సి ఉంది. దీంతో ఆకాశంలో మబ్బులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా వరి ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారస్తులు తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని, మిల్లర్లు తేమ పేరుతో ధాన్యం ధరను తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు క్వింటా ధాన్యానికి రూ.24 వందల ధర ఇవ్వగా, ప్రస్తుతం రూ.2వేలకే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

మబ్బులతో ఆందోళనగా ఉంది



ఆకాశంలో మబ్బులతో ఆందోళనగా ఉంది. వాతావరణాన్ని అదునుగా చూసుకొని మిల్లర్లు కొర్రీలు పెడుతూ దోపిడీ చేస్తున్నారు. మొన్నటి వరకు క్వింటా రూ 2,400 కొనుగోలు చేసిన వ్యాపారస్తులు ప్రస్తుతం క్వింటాకు రూ.18 వందల నుంచి రూ.2 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. గత్యంతరం లేక అమ్ముకొని నష్టాల భారిన పడుతున్నాం

– డి.కిరణ్‌రెడ్డి, రైతు, హుజూర్‌నగర్

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఆయకట్టు ప్రాంతంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కావున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు వ్యాపారులకు ధాన్యం అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబోసుకునే సౌకర్యం కల్పించి టార్పాలిన్ పట్టాలను రైతులకు అందుబాటులో ఉంచాలి.

– బత్తిని నాగరాజు, రైతు, హుజూర్‌నగర్

మెరిట్ విద్యార్థులకు 'మహా' స్కాలర్స్



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మైహోం అధికారులు

మేళ్లచెరువు : మండల కేంద్రం సమీపంలోని మైహోం సిమెంట్ పరిశ్రమ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మహా స్కాలర్స్ పేరుతో ప్రతియేటా ఇచ్చే నగదు ప్రోత్సాహకాలను మైహోం పరిశ్రమ అధికారులు పరిశ్రమ ఆడిటోరియంలో శుక్రవారం అందజేశారు. మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, కోదాడ మండలాల్లోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 3 కేజీబీవీలలో పదవ తరగతిలో సత్తా చాటిన 39 మంది విద్యార్థులలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.8 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.4 వేలు నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. మొత్తం 13 పాఠశాలలకు రూ.2,34,000 అందజేసినట్లు పరిశ్రమ అధికారులు తెలిపారు. సీఎస్ఆర్ ద్వారా పేద విద్యార్థులకు చేయుతనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ హెడ్ జీఎంలు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శ్రీరామ్, ఏజీఎం శ్రీనివాస్, పరిశ్రమ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమాదేవి

కోదాడ : మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే వాటిని తొలగిస్తామని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. కోదాడ ప్రభుత్వ వైద్యశాల ముందు ప్రధాన రహదారిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని ఈ నెల 3న సాక్షి పత్రికలో 'రోడ్డును ఆక్రమించి.. పక్కా నిర్మాణం'శీర్షికతో కథనం ప్రచురించడంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని హెచ్చరించారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రుణాలు చెల్లించిన రైతులు అధైర్య పడవద్దు

మునగాల : మండలంలోని తాడువాయిలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న రుణాలను చెల్లించిన రైతులు అధైర్య పడవద్దని సంఘం చైర్మన్ తొగురు సీతారాములు తెలిపారు. శుక్రవారం తాడువాయిలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంఘంలో జరిగిన అవకతవకలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తాను సంఘం చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టినప్పుడు సంఘం రూ.80 లక్షల నష్టంతో ఉందని, అనంతరం పాలకవర్గం సమష్టి కృషితో రూ.రెండు కోట్ల ఆదాయంతో లాభాల బాటలో కొనసాగుతుందన్నారు. సహకార సంఘంలో బీమాకు సంబంధించి బ్యాంకు అధికారులు, సంఘం సీఈఓ అవగాహన లోపంతో నగదు స్వాహా చేయడం వాస్తవమేనన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను సీతారాములు ఖండించారు. సంఘంలో సుమారు రూ.35 లక్షలు దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించి బాధ్యులైన సంఘం సీఈఓ, ఎస్‌ఏ, కంప్యూటర్ ఆపరేటర్‌ను జిల్లా సహకార సంఘం అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సదరు నగదును తిరిగి వారినుంచి రికవరీ చేసి సభ్యులకు న్యాయం చేసేందుకు తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు.

కష్టపడి చదవాలి

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తహసీల్దార్ వి.సరిత అన్నారు. శుక్రవారం నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్, డాక్టర్ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి శిష్య బృందం, భక్తులు

మోతె : మండలంలోని నర్సింహాపురం గ్రామంలో గల సీతారామాంజనేయ అనంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గణపతి సచ్చిదానందస్వామి శిష్య బృందం వారిచే భగవద్గీత పారాయణం చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భగవద్గీతలోని 18 అధ్యాయాలను సామూహికంగా పఠించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండా లక్ష్మయ్య, ఆలయ అర్చకుడు కాందరి విజయకుమారాచార్యులు, కొండా అరవింద్‌కుమార్ దంపతులు, అలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, బజనా బృందం, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కుంకుమార్చన



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈవో ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, సైదయ్య, గ్రామ కార్యదర్శి రెడ్డిపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

మోతె : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీమ్ లీడర్ పల్లెల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మోతె మండలంలోని మామిళ్లగూడెం గ్రామంలో సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పేరుతో సుమారుగా సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సన్న బియ్యంతో ప్రతి కుటుంబం మూడు పూటలు భోజనం చేయాలని ఒక్కొక్కరికి 6 కేజీల సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక కళా సారధి కళాకారులు గంట భిక్షపతి, వేముల శ్రావణ్, పల్లెల రాము, కందమల్ల నాగలక్ష్మి, ఒంటిపాక ప్రియాంక, మేడి ఇంద్రజ ప్రియదర్శిని, డీలర్ రామకోటి పాల్గొన్నారు.

లంబాడాలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఇందిరమ్మది

మఠంపల్లి : లంబాడాలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరాగాంధీకే దక్కిందని గిరిజనశక్తి మండల అధ్యక్షుడు ఈశ్వర్ నాయక్ అన్నారు. శుక్రవారం మఠంపల్లిలో జరిగిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడాల పాత్ర కీలకమనీ, రాష్ట్ర క్యాబినెట్‌లో లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు లచ్చిరామ్‌నాయక్, జగన్‌నాయక్, నరసింహనాయక్, నాగరాజునాయక్, మధునాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్షంలోని గ్రహాలను వీక్షించిన విద్యార్థులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం స్కైవాచ్ పేరుతో అంతరిక్షం వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశంలో నక్షత్రాలు, గ్రహాలు, వాటి స్థితిని విద్యార్థులు టెలిస్కోప్‌తో వీక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అంతరిక్షానికి సంబంధించిన విషయాలు తెలియజేసి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరెడ్డి, నారపరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపంలో శుక్రవారం ముందస్తుగా శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పుణ్యావాసనం, వాస్తు పూజ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భవురిశెట్టి వెంకటరత్నం, కేవీఎస్ఎన్ గుప్త, వందనపు సూర్యప్రకాశ్‌రావు, వందనపు మోహన్‌రావు, కొండా దుర్గారావు, గజ్జి అప్పారావు, దయాకర్, దివ్వెల శ్రీను, చిల్లంచర్ల సత్యనారాయణ, ఉపేందర్, కృష్ణమూర్తి, వెంకన్న, శ్రీను, పూజారి వరదాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నడిగూడెం : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం నడిగూడెం బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ జగన్నాథం, సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ వదలండి.. పుస్తకాలు చదవండి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నలమాద పద్మావతి



కోదాడ : సంతోష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారి పక్కదారి పడుతున్నారని, జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలంటే సెల్ ఫోన్స్ వదిలేసి పుస్తకాలు చదవాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేఆర్ఆర్ కళాశాలలో చదివిన వేల మంది దేశ, విదేశాల్లో మంచి హోదాలో ఉన్నారని, విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకొని చదువులో రాణించాలన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం వివిధ సబ్జెక్ట్‌ల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి మెమొంటోలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ హెడ్సరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ మార్కెట్ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ, కేఆర్ఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్స్ అందె సత్యం, అర్వపల్లి శంకర్, మార్కెట్ వైస్ చైర్మన్ బషీర్, మంత్రి ప్రగడ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

కోదాడ : కబడ్డీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణిస్తూ ఈ ప్రాంతానికి పేరు తేవడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. కోదాడ గోల్డెన్ క్లబ్‌కు చెందిన క్రీడాకారుడు సంతోష్ 71వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిత్యం వహించాడు. శుక్రవారం కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంతోష్‌ను, కోచ్ నామానాగేశ్వరరావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మేదారం గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జగదీష్‌రెడ్డి

నేరేడుచర్ల: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, వరి కోతలు పూర్తి కావస్తున్నా నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలం మేదారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి కోతలు 50శాతానికి పైగా పూర్తయ్యాయని, ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. రైతులకు రూ.500 బోనస్ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, చెన్నబోయిన సైదులు, నెమ్మాది భిక్షం, జయబాబు, ఎల్లబోయిన లింగయ్య, సైదులు, హరి, నాగరాజు, రాములు, లచ్చయ్య, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలి



కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని పలువురు న్యాయవాదులు డిమాండ్ చేశారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది నూతి సురేష్‌పై దుండగులు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా న్యాయవాదులపై భౌతికదాడులు అధికమయ్యాయని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు, ముఖ్యంగా న్యాయవ్యవస్థకు గొడ్డలి పెట్టు అని వారు పేర్కొన్నారు. ముందుగా విధుల బహిష్కరణకు సహకరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ తీర్మాన కాపీలను రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాం శ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, ప్రదీప్తి, శ్రీలక్ష్మి, శృతి, కె.బాలకృష్ణ, డి.శ్రీనివాసరావు, యాదగిరి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, సురేష్, పి.శ్రీనివాసరావు, వి.యాదగిరి, శ్రీను, నాగూర్ పాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణభారతి' సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన హైటెక్ చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారని, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే రంగా థియేటర్ సెంటర్‌లో వేసవికాలం పూర్తయ్యేవరకు చలివేంద్రం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు, నీలా సత్యనారాయణ, రాజశేఖర్, కిట్టు, సుధాకర్, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి




మునగాల : ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న బచ్చలకూరి స్వరాజ్యం, పంచాయతీ సిబ్బంది

మునగాల : గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 తర్వాత సమ్మెకు దిగుతామని సమ్మె నోటీస్‌ను గ్రామపంచాయితీ సిబ్బంది శుక్రవారం స్వరాజ్యంతో కలిసి మునగాల ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా స్వరాజ్యం మాట్లాడుతూ జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదని, ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చినట్లే 2025 జనవరి నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వాసిమకల వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు ఎల్.నాగార్జున, మామిడి వెంకటేశ్వర్లు, ధార రవికుమార్, షేక్ సైదా, జానీ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

గరిడేపల్లి : పంచాయతీ కార్మికులకు రావాల్సిన ఆరు నెలల వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే యాకూబ్ కోరారు. ఈ నెల 19 వరకు తమ పరిష్కరించాలని లేనియెడల నిరవధిక సమ్మెకు వెళ్తామని శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొండ సైదులు, బాలకృష్ణ, వీరస్వామి, వరప్రసాద్, మామిడి గోపి, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ముస్తాబు



మునగాలలో ముస్తాబైన రామాలయం

మునగాల : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించబోయే శ్రీరామనవమి వేడుకలకు రామాలయం ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆదివారం మంగళ తోరణాల ఉత్సవం, ఉత్సవమూర్తులకు అలంకరణ, ఉత్సవ మూర్తుల కల్యాణ మండప ప్రవేశం, అనంతరం స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం తీర్థ ప్రసాద వితరణ చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

చిలుకూరు : పాత చిలుకూరులో కాకతీయ కాలంలో నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో ఆదివారం జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా మండల వ్యాప్తంగా గల రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.